క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

దొర్నిపాడు: ఆసరా నాల్గో విడత ప్రారంభోత్స వానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శనివారం దొర్నిపాడుకు వస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో ఉదయం 11గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పొదుపు మహిళలు హాజరు కావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఆళ్లగడ్డ తాలూకా ఖోఖో కార్యదర్శి ప్రభాకర్ నుంచి రూ.65వేలు అందుకుంటున్న దృశ్యం

శిరివెళ్ల: ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు గోవిందపల్లె గ్రామ బాలుర జట్టు ఎంపికైందని ఎంపీడీఓ రాజకుమారి శనివారం తెలిపారు. ఈ నెల 3న నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో నందికొట్కూరు నియోజకవర్గంలోని ముచ్చుమర్రి గ్రామ సచివాలయ జట్టుపై విజయం సాధించిందన్నారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థినులను వొకేషనల్ కోర్సులో భాగంగా శనివారం హెచ్ఎంలు పద్మావతి, సునీత ఇండస్ట్రియల్ విజిట్‌కు తీసుకెళ్లారు. పట్టణంలోని యూనివర్సల్ బొటిక్ సెంటర్‌లోని కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే సచివాలయం-32లో కంప్యూటర్ వినియోగంపై అవగాహన కల్పించారు.

బోధనలో నూతన ఒరవడి



శిక్షణ ఇస్తున్న నాగేంద్రకుమార్

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులు బోధనలో నూతన ఒరవడి సృష్టించడానికే రాష్ట్ర ప్రభుత్వం సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలో ఐసీటీ సిమ్యూలేషన్ ట్రైనింగ్ ఏర్పాటు చేసిందని ఐసీటీ జిల్లా కోఆర్డినేటర్ నాగేంద్రకుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటరాక్టివ్ ప్యానల్స్‌లో సిమ్యూలేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా కఠినమైన పాఠ్యాంశాలను సులభంగా టెక్నాలజీని జోడించి ఎలా బోధించాలి అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఓ వ్యాబ్, పెట్, క్విజ్ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్ గురించి వివరించారు. హెచ్ఎం పద్మావతి, రీసోర్స్ పర్సన్‌లు ప్రసాద్, నరసింహారెడ్డి, రాము పాల్గొన్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



లక్ష్మి పెద్దయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గాయత్రి

నంద్యాల(అర్బన్): చాబోలు గ్రామానికి చెందిన పిక్కిలి లక్ష్మి పెద్దయ్య కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకొని చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామం వలంటీర్ గాయత్రి శనివారం అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసింది. ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో ఇచ్చిన పింఛన్ సొమ్ము తనకు అండగా నిలిచిందని పెద్దయ్య సంతోషం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల పట్టణ శివారులోని మూలమఠంలో శ్రీభీమేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ రామాంజనేయశర్మ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆసక్తి కలవారు ఈనెల 12వ తేదీ లోపు రైతు నగరంలో శివ సాయి గ్రీన్ హౌస్‌లోనున్న జిల్లా దేవదాయ శాఖ ఆఫీసులో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు కలర్ జిరాక్స్, కుల, పోలీస్ ధ్రువ పత్రాలతో జతచేయాలని చెప్పారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబుల దిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, కుంకుమార్చన, వడమాల, ఆకుపూజలు చేపట్టారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేషశర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోక్సో కేసు నమోదు

రుద్రవరం: స్థానిక బెస్తకాలనీకి చెందిన మురారి ఓబులేసు అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ నిరంజన్ రెడ్డి శనివారం తెలిపారు. ఇటీవల అదే కాలనీకి చెందిన ఓ బాలికపై ఇంట్లో ఎవరులేని సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. కూలీ పనుల నుంచి వచ్చిన తన తల్లిదండ్రులకు బాధితురాలు విషయం చెప్పింది. వారు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేసి పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

బాబుకు మళ్లీ బుద్ధి చెప్పండి



పొదుపు సంఘాల మహిళలకు ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: రుణమాఫీ పేరిట దగా చేసిన చంద్రబాబు నాయుడుకు మళ్లీ బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద 972 డ్వాక్రా సంఘాలకు రూ.8.31 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తామని బాబు ఊరూరు తిరిగి ప్రచారం చేశారని, ఎన్నికల్లో గెలిచిన తరువాత ఆ ఊసే ఎత్తలేదని గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో పసుపు- కుంకుమతో మోసం చేయాలని చూస్తే మహిళలు తగిన శాస్తి చెప్పారని, మరోసారి ఇప్పుడు ఎన్నికలు సమీపించడంతో మీ వద్దకు మోసపూరిత వాగ్దానాలతో వస్తున్నాడని, మరోసారి ఇంటికే సాగనంపి అందరికీ మేలు చేస్తున్న జగనన్నను మళ్లీ గెలిపించుకుందామని సూచించారు. జగనన్న పాలన, చంద్రబాబు హయాంతో పోల్చుకోవాలని ఎవరు మేలు చేశారో మీరే నిర్ణయించాలని కోరారు. అనంతరం మహిళలు సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నజీర్, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, రాష్ట్ర హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు నరహరి, వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, పొదుపు సంఘం మండల అధ్యక్షురాలు రేవతి, మండల మాజీ ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, దేవస్థానం చైర్మన్ తిమ్మరాయుడు, కాపు సంఘం నాయకులు ముడిమేల నాగరాజు, ఉల్లి సుబ్బరాయుడు, సర్పంచులు నాగన్న, శివారెడ్డి, పెద్ది రమణయ్య, దూదేకుల గుర్రప్ప, రఘునాథరెడ్డి, ఏపీఎం పుణ్యావతి, ఏసీ దానం, ఆసరా జిల్లా కోఆర్డినేటర్ ఎల్లయ్య పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి పెద్దపీట



రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: గ్రామీణ రోడ్ల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. రూ 5.92 కోట్ల నాబార్డ్ నిధులతో పడకండ్ల నుంచి చందలూరు, మందలూరు, మాచినేనిపల్లె మీదుగా సీఎం రోడ్డు వరకు సుమారు 16 కి.మీ. మేర నిర్మించనున్న రోడ్డు పనులను శుక్రవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఇంతకు ముందెన్నడూ కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలోని గ్రామాల రహదారులను తీర్చిదిద్దలేదని, తమ ప్రభుత్వ హాయంలో చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ రోడ్డు వెంటనున్న సుమారు 10 గ్రామాల ప్రజలు ఇప్పటి వరకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పనులు పూర్తయితే అవస్థలు తప్పుతాయన్నారు. నెలలోపు పనులు పూర్తి చేస్తారని హామీ ఇచ్చారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, సీపీ శ్రీనివాసరెడ్డి, సుధాకర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, డీఈ వెంకటసుబ్బయ్య, కాంట్రాక్టర్ శివరామిరెడ్డి ఉన్నారు.

ముక్తిదాయిని..భగవద్గీత

నంద్యాల(వ్యవసాయం): భగవద్గీతను పఠిస్తే సకల శోకముల నుంచి విముక్తిని కలిగించి, మానవుడికి ముక్తిని ప్రసాదిస్తుందని ప్రముఖ వ్యాఖ్యాత, సంస్కృత పండితులు డాక్టర్ డీవీ హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం బాలకొండహాల్ వీధిలో వెలసిన శ్రీ సీతారామ సమేత త్యాగరాజ స్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీమద్రామాయణం, మహాభారతం భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు వినిపించారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, శ్రీ త్యాగరాజ స్వామి దేవస్థానం ధర్మకర్త రామాయణం శివరామకృష్ణ, శ్రీనివాసులు, సురేశ్ బాబు, పల్లా నాగరాజు, పత్తి మోహన్, బాల కొండారెడ్డి, పోలా సుధాకర్ బాబు, అర్చకులు యజ్ఞ రామశర్మ, సునీల్ శర్మ, భజన మండలి అధ్యక్షులు బాల నాగిరెడ్డి, శ్రీనివాసులు, నరసింహులు పాల్గొన్నారు.

ఇది అభివృద్ధి కాదా?



యర్రగుంట్లలో సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

శిరివెళ్ల: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోని వీధుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించింది ప్రతిపక్ష పార్టీలకు కనిపించదా? ఇవి అభివృద్ధి పనులు కాదా అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి ప్రశ్నించారు. శనివారం యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో రూ. 42 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి పథకం నిధులతో వేసిన 9 సిమెంట్ రోడ్లు, రూ.35 లక్షల వరద నిధులతో నిర్మించిన వంతెనను ప్రారంభించారు. అలాగే ఇప్పటికే గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కోట్లాది రూపాయలను ఒక్క గ్రామానికే వెచ్చించి పనులు చేయడం ఇంతకు ముందు జరిగిందా అని గ్రామస్తులను ప్రశ్నించగా లేదని వారు ముక్తకంఠంతో సమాధానమిచ్చారు.

సంక్షేమాభివృద్ధే లక్ష్యం



సీసీరోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల(అర్బన్): సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కానాల, హైస్కూల్ కొట్టాల గ్రామాల్లో శనివారం సాయంత్రం రూ.63 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఆర్‌బీకేను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సీఎండీఎఫ్ నిధులు రూ.10 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ.32 లక్షలతో సీసీ రోడ్లు, ఎంపీ నిధుల కింద హైస్కూల్ కొట్టాల నుంచి నాగులవరం గ్రామం వరకు ఆయకట్టు రోడ్డు ఏర్పాటుకు రూ.15లక్షలు, నూతన ఆర్‌బీకే ఏర్పాటుకు రూ.21.8 లక్షలు వెచ్చించామన్నారు. మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, నాయకులు కల్లూరు రామలింగారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, పురుషోత్తమరెడ్డి,సర్పంచ్ బావమ్మ, ఎంపీటీసీ రంగారావు, జగదీశ్వరరెడ్డి, నాగన్న, సుబ్బనర్సయ్య, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓలు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్. సూర్యనారాయణరెడ్డి

చాగలమర్రి: ఎంపీడీఓగా ఎస్.సూర్యనారాయణ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేస్తున్న షేక్.మహబూబ్‌దౌలాను సత్యసాయి జిల్లా, నల్లమడ మండలానికి బదిలీ చేయగా ఆయన స్థానంలో వైఎస్సార్ జిల్లా, ముద్దనూరు మండల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఎస్.సూర్యనారాయణరెడ్డిని ఇక్కడికి పంపారు.



విధుల్లో చేరిన ఫణి రాజకుమారి

శిరివెళ్ల: మండల నూతన ఎంపీడీఓగా ఫణి రాజకుమారి శనివారం బాధ్యతలను స్వీకరించారు. గత ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం వైఎస్సార్ జిల్లా గోపవరం బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది. నూతన ఎంపీడీఓ వైఎస్సార్ జిల్లా రాజంపేట నుంచి వచ్చారు.



ఎంపీడీఓను అభినందిస్తున్న కార్యదర్శులు

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా జీవి రఘురామ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. అలాగే అక్కడ నుంచి బదిలీపై వచ్చిన రఘురామ్‌కు పంచాయతీ కార్యదర్శులు స్వాగతం పలికారు.



ఎంపీడీఓను సత్కరిస్తున్న దృశ్యం

రుద్రవరం: ఎంపీడీఓగా రామచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ కడప జిల్లా సుండుపల్లె నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఇంటింటికీ కుళాయి



రూపనగుడిలో పైపులైన్ ఏర్పాటుకు లెవెలింగ్ చూస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ఉయ్యాలవాడ : గ్రామాల్లో తాగునీటి కష్టాలకు త్వరలో శాశ్వత పరిష్కారం లభించనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసేందుకు రూ.1.22 కోట్లు మంజూరు కావడంతో మండలంలో మూడు గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏపీ గ్రామాల్లో ఎన్ని గృహాలు ఉన్నాయి. ఎన్ని వాటర్ ట్యాంకులున్నాయి, పైపులైన్లు ఎంత మాత్రం మేరకు ఉన్నాయి, ఇంకా అదనంగా వాటర్ ట్యాంకులు అవసరం, పైపులైన్ ఎంత వరకు చేయాలో సర్వేలో తేల్చారు. ఆ సర్వే ప్రకారం ఇళ్ల సంఖ్య ఆధారంగా ప్రస్తుతం మండల కేంద్రంలో రూ.57 లక్షలతో పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే పెద్దయమ్మనూరులో రూ. 32.9 లక్షలు, రూపనగుడిలో రూ.32.1లక్షతో ఓవర్‌హెడ్ ట్యాంకులు పైపులైన్లతో పాటు ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటుకు పనులు కొనసాగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ శనివారం వివరించారు.

జిల్లా కలెక్టర్‌కు అభినందన



జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎంపీ పోచా

నంద్యాల(అర్బన్): జిల్లా కలెక్టర్‌గా కె.శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టడంతో పలువురు రాజకీయ, పట్టణ ప్రముఖులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ఏపీ ఫుడ్‌ప్రాసెసింగ్ ఇండస్ట్రీయల్ అధ్యక్షుడు కల్లూరి రామలింగారెడ్డి, మహానందీశ్వర దేవస్థానం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి కలిశారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్ఎం



రజియా సుల్తానాకు శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

నంద్యాల టౌన్: నంద్యాల జిల్లా ప్రజా రవాణాధికారిగా రజియా సుల్తానా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్ఎంగా వ్యవహరిస్తున్న శ్రీనివాసులు కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లాలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీరుగా ఉన్న రజియా సుల్తానాను ఇక్కడికి ఆర్ఎం నియమించారు.

ప్రశాంతంగా జీవించండి

రుద్రవరం: గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుక రావాలని, లేదా సామరస్యంగా పరిష్కరించుకోవాలని సీఐ వంశీధర్, ఎస్ఐ నిరంజన్ రెడ్డి సూచించారు. మండలంలోని ఆలమూరులో శనివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల సందర్భంగా ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని చెప్పారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కంప చెట్ల తొలగింపు



మైదానాన్ని శుభ్రం చేస్తున్న జేసీబీ

రుద్రవరం: స్థానిక తువ్వపల్లె తిప్పమీద ఉన్న ఏపీ మోడల్ పాఠశాలలో శనివారం జేసీబీతో క్రీడా మైదాన్ని శుభ్రం చేయించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం - శ్రీ స్కూల్స్ పథకంలో భాగంగా ఎన్ఈపీ అమలుకు తమ పాఠశాల ఎంపికైందన్నారు. పీఎంసీ చైర్మన్ వాసు, పీఈటీ శ్రీనివాసులు ఉన్నారు.

ముగిసిన మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు



ట్రోఫీలు, ప్రశంసా పత్రాలతో విజేతలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నందిపైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శనివారం ఉమ్మడి జిల్లాల మాస్టర్స్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి పోటీలు ముగిశాయి. పోటీల్లో 35 ప్లస్ సింగిల్స్,డబుల్స్‌లో రాజ్‌పాల్, నూర్‌అహమ్మద్, 40 ప్లస్‌లో సింగిల్స్, డబుల్స్‌లో నందికొట్కూరుకు చెందిన రామకృష్ణ విన్నర్‌గా, రన్నర్‌గా శ్రీకాంత్ నిలిచారు. 45 ప్లస్‌లో సింగిల్స్‌లో జి.పుల్లయ్య (కర్నూలు), రన్నర్ పవన్‌కుమార్, డబుల్స్‌లో పవన్‌కుమార్, శ్రీకాంత్ (నంద్యాల), 50 ప్లస్ సింగిల్స్, డబుల్స్‌లో విన్నర్‌గా నాగన్న (కర్నూలు), మారుతికుమార్ విజేతలుగా నిలిచారు. అలాగే 55 ప్లస్‌లో సింగిల్స్‌లో విన్నర్‌గా శివమునిరెడ్డి, రన్నర్‌గా మారుతిరావు, డబుల్స్‌లో కూడా వీరే విజేతలుగా నిలిచారు. 60 ప్లస్‌లో విన్నర్‌గా సత్యనారాయణ, డబుల్స్‌లో సత్యనారాయణ, ఆంజనేయులు గెలుపొందారని నిర్వాహకులు తెలిపారు. దిశ డీఎస్పీ మారుతిరావు, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వంశీధర్, శేషిరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపుతున్నాం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల (సిటీ): పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపుతున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం 23వ వార్డులో కౌన్సిలర్ రాజ్యలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ పార్థసారధితో కలిసి రూ.45.5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, మంచినీటి పైప్ లైన్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రాధాన్యత క్రమంలో పనులు చేస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, నాయకులు పుల్లయ్య, మహేశ్వరి, ఉసేనమ్మ, టైలర్ శ్రీను, శిల్పా రమణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ..

పట్టణంలోని 13, 14వ వార్డుల పరిధిలోని పద్మావతి నగర్‌లో రూ.80 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణానికి కౌన్సిలర్లు సరస్వతి, విమలమ్మతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా శనివారం భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని గతానికి భిన్నంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇవన్నీ టీడీపీ నాయకులకు కనిపించదా అని ప్రశ్నించారు.

చిరువ్యాపారులకు ప్రభుత్వ అండ

నంద్యాల(సిటీ): మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. కౌన్సిల్‌లో చిరు వ్యాపారులు, గంపలపై వ్యాపారం చేసుకుంటున్న వారి నుంచి వసూలు చేసే రుసుము రద్దు చేయాలని తీర్మానించినందుకు నంద్యాల జిల్లా చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు శనివారం ఆయన నివాసంలో కలిసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు ఆకుమల్ల రహీం, సత్య నారాయణ పాల్గొన్నారు.

నేడు మహా పుష్పయాగం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి మహా పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు వాసవి దీక్ష మండలి గౌరవ అధ్యక్షుడు సంపత్ కుమార్, రమేష్ బాబు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో కరపత్రాలను విడుదల చేసి వారు మాట్లాడారు.

క్రీడా,సాంస్కృతిక కళల్లోనూ ముందుండాలి



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న దృశ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడాసాంస్కృతిక కళల్లోనూ ముందుండాలని, ఆధునిక టెక్నాలజీలో భాగస్వాములై నంద్యాల జిల్లాకు కీర్తిప్రతిష్టలు తీసుకు రావాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి తెలిపారు. శనివారం రాత్రి పట్టణంలోని శ్రీగురురాజ విద్యాసంస్థల 22వ వసంతోత్సవ వేడుకలను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.దస్తగిరిరెడ్డి, డైరెక్టర్లు షేక్షావలి రెడ్డి, మౌలాలిరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి పాఠశాల వార్షికోత్సవ సంచికను ఆవిష్కరించారు. అనంతరం 2022-23 విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 33 మంది విద్యార్థులకు నగదుతో పాటు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, రవికృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు సృష్టించుకోవద్దు

చాగలమర్రి: గ్రామాల్లో ప్రజలు చిన్న విషయాలను పెద్దదిగా పెంచుకొని సమస్యలను సృష్టించుకోకుండా ప్రశాంతంగా జీవించాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్ తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని రాంపల్లె గ్రామంలో ఎస్ఐ రమణయ్యతో కలిసి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రచ్చబండ వద్ద స్థానికులతో సమావేశం నిర్వహించి ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడరాదని, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉచిత రిజిస్ట్రేషన్లకు స్పందన



క్రిష్టిపాడు సచివాలయంలో రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని 9 గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న ఉచిత రిజిస్ట్రేషన్లకు లబ్ధిదారుల నుంచి స్పందన లభిస్తోంది. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది. దీంతో వాటికి పూర్తి భద్రత కల్పిస్తూ ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లోనే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుంది. శనివారం క్రిష్టిపాడు గ్రామంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి ధ్రువపత్రాలను సర్పంచ్ శివరామిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్ఓ మురళీమోహన్ అందజేశారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పరిశీలన

మండలంలోని క్రిష్టిపాడు గ్రామ సచివాలయంలో జరుగుతున్న ఉచిత రిజిస్ట్రేషన్ ప్రక్రియను కోవెలకుంట్ల సబ్‌రిజిస్ట్రార్ సర్వేశ్వరనాథ్ శనివారం పరిశీలించారు. వివరాల నమోదుపై డిజిటల్ అసిస్టెంట్ వర్షకు పలు సూచనలు చేశారు.